క్లుప్తంగా

బడిబాట ముగింపు



గోవిందరావుపేట: బడి బాట ముగింపు సందర్భంగా మండలంలోని పాఠశాలల ఆధ్వర్యంలో ఎంఈఓ గొంది దివాకర్, నోడల్ అధికారి సోమారెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ పాఠశాలలో తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుందని అన్నారు.

విద్యార్థులకు క్రీడలు



వాజేడు: బడిబాట చివరి రోజు కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. మండల పరిధిలోని నాగారం గ్రామం ఎంపీపీఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు బాలాజీ విద్యార్థులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. బడి బాటలో భాగంగా 15 మంది విద్యార్థులను బడిలో చేర్పించినట్లు తెలిపారు. ఆటల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్సై కృష్ణ ప్రసాద్



వాజేడు: మండల పరిధిలోని పేరూరు ఎస్సైగా గుర్రం కృష్ణ ప్రసాద్ బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఏటూరునాగారం ఎస్సైగా పని చేస్తున్న ఆయన బదిలీపై పేరూరుకు వచ్చారు. పేరూరు ఎస్సైగా పని చేస్తున్న గొర్ల రమేశ్ ములుగు వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మట్టెల అశోక్ తల్లి మట్టెల మల్లక్క అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోరిక గోవింద్‌నాయక్ పరామర్శించారు. ఈ మేరకు బుధవారం మల్లక్క పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు పాలెపు శ్రీను, భూక్య అమర్‌సింగ్, ఎంపీటీసీ స్వామిరావు, రాజాహుస్సేన్, భాస్కర్, కవ్వంపల్లి బాబురావు తదితరులు ఉన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన



వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి గ్రామంలోని పల్లె దవాఖాన ఆధ్వర్యంలో బుధవారం నులిపురుగుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పల్లె దవాఖాన పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు గురువారం మాత్రలను వేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తెలిపారు. 19సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని సూచించారు.

మాంటిస్సోరి స్కూల్‌లో పుస్తకాలు సీజ్

కాటారం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మండల కేంద్రంలోని మాంటిస్సోరి స్కూల్‌లో విక్రయిస్తున్న పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లను బుధవారం ఆర్‌ఐ వెంకన్న సీజ్ చేశారు. అనుమతులు లేకుండా పుస్తకాలు విక్రయిస్తున్నారని ఎస్ఎఫ్ఐ, డీవైఎస్ఎఫ్ నాయకులు మండల విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ఆర్ఐ వెంకన్న, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుదర్శన్ పాఠశాలను సందర్శించి పుస్తకాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిల్వ చేసిన పుస్తకాలను సీజ్ చేసి స్థానిక ఎంఈఓ కార్యాలయానికి తరలించారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాల అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



కాలి నడకన వెళ్తున్న వైద్య సిబ్బంది



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ భవ్యశ్రీ



వాజేడు: అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతరాంపురం గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది కాలినడకన సుమారు ఐదు కిలో మీటర్ల దూరం వెళ్లి గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా సికిల్ సెల్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు అవసరం

వాజేడు: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని వాజేడు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయ, వైద్యాధికారి మహేందర్ అన్నారు. మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో బుధవారం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. దోమ తెరలను వాడాలని, చెడు అలవాట్లు, మద్యానికి దూరంగా ఉండాలని తెలిపారు. పౌష్టికాహారాన్ని తీసుకోవాలని చెప్పారు. మల విసర్జనకు ఆరుబయటకు వెళ్లకుండా మరుగుదొడ్లను ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, సూర్య ప్రకాష్, కామేష్, కోటి రెడ్డి, హనుమంతు తదితరులు ఉన్నారు.

వరద ముంపు ప్రజలు జాగ్రత్తలు పాటించాలి



ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

ఎస్ఎస్‌తాడ్వాయి: వరద ముంపు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సుమనవాణి అన్నారు. బుధవారం మండలంలోని జంపన్నవాగు ముంపు గ్రామాలైన ఊరట్టం, వెంగ్లాపూర్, నార్లాపూర్ గ్రామాల్లో ఎంపీడీఓ సుమనవాణి, తహసీల్దార్ రవీందర్ సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో సమావేశమై వర్షాల వరదలకు ముంపు ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రతలు పాటించాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేస్తున్నామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ముంపు గ్రామాల ప్రజలకు అప్రమత్తం చేయడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రతలపై పలు సుచనలు సలహాలు చేశామన్నారు. వారి వెంట ఎంపీఓ శ్రీధర్, ఆర్ఐలు సాంబయ్య, రాజు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వాజేడు: వర్షాకాలంలో పల్లపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ అన్నారు. మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై హరీశ్ మాట్లాడుతూ.. గతంలో వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల వారి వివరాలను అందజేయాలని సూచించారు.

న్యాయం జరిగే వరకూ పోరాడుతాం

వెంకటాపురం(కె): కొమరంభీమ్ కాలనీ ఆదివాసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. ఆదివాసీల భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్ష పదో కొనసాగింది. ఈ సందర్భంగా యాకన్నగూడెం ఆదివాసీ మహిళలు దీక్ష శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆదివాసీల భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పూనెం ప్రతాప్, తదితరులు ఉన్నారు.



పూలమాల వేసి సంఘీభావం తెలుపుతున్న మహిళలు

సికిల్‌సెల్ ఎనిమియా నివారణే లక్ష్యం



మంగపేట: అవగాహన కల్పిస్తున్న యమున



వెంకటాపురం(ఎం): ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్ రణధీర్

వెంకటాపురం(ఎం): సికిల్‌సెల్ ఎనిమియా రహిత సమాజమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ అన్నారు. ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏజెన్సీలో గిరిజనులను దీనిపై చైతన్యం తీసుకురావాలన్నారు. 2047 నాటికి సికిల్‌సెల్ ఎనిమియాను నిర్మూలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యం నిర్దేశించాయన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సికిల్ సెల్ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సదానందం, ఏఎన్ఎం సూర్యకాంతమ్మ, ఎల్‌టీ కృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ డిసీజ్‌పై వగాహన

మంగపేట: మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నపెల్లి యమున ఆధ్వర్యంలో మల్లూరు సబ్ సెంటర్ పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యమున మాట్లాడుతూ.. ఇన్‌సెల్ డిసీజ్ ఎర్ర రక్త కణాలు గుండ్రంగా ఉంటాయని, సికిల్ సెల్ డిసీజ్ ఉన్న వారిలో ఇవి సికిల్ ఆకారంలో ఉండటంతో వారు రక్తహీణతకు లోనవుతారన్నారు. దీనివలన అనేక జబ్బులు సోకే ఆస్కారం ఉంటుందని, దీనిని ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం వలన అరికట్ట వచ్చన్నారు. దీనికోసం విద్యార్థులకు టెస్టులు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. పీహెచ్ఎన్ రాంబాయి. పాఠశాల హెచ్ఎం భద్రయ్య, ఏఎన్ఎం సీతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధి నిర్మూలనకు కృషి

ఎస్ఎస్‌తాడ్వాయి: సికిల్ సెల్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి రణధీర్ అన్నారు. ప్రపంచ సికిల్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సికిల్ సెల్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికిల్ సెల్ వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందన్నారు. సికిల్ సెల్ రక్తహీనతకు దారితీస్తుందన్నారు. రక్తహీనత, కీళ్ల నొప్పులు, కీళ్ల వాపులు, తరచుగా జ్వరం వస్తుందని, ఛాతినొప్పి అరుదుగా ఉంటుందని, ఆయాసం వస్తుందని తెలిపారు. దీనికి చికిత్స సరైన వైద్యం అందుబాటులో లేదని, అవగాహన నివారణ ముఖ్యమని తెలిపారు. చికిత్సలో భాగంగా హైడ్రాక్స్ యూరియా, రక్తమార్పిడి, మూలగ మార్పిడి, ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఉంటాయని తెలిపారు. సికిల్ సెల్ జబ్బు ఉన్నవారు పెళ్లి చేసుకోకూడదని ముందస్తుగా పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. యుక్త వయసు బాలికలలో ఎక్కువగా ఉంటుందని, వ్యాధి రాకుండా నియంత్రించాలని, ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాపించకుండా కట్టడి చేయాలని తెలిపారు. రక్తమార్పిడి లాంటివి చాలా కష్టంగా ఉంటాయన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు, రోగనిర్ధారణ శిబిరాలు నిర్వహించాలని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎంఓ సంజీవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కారోబార్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

మంగపేట: మండలంలోని రాజుపేట గ్రామ పంచాయతీ కారోబార్‌పై దాడి చేసిన చదలవాడ వెంకటయ్యపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మిషన్ భగీరథపై సర్వే నిర్వహించేందుకు పంచాయతీ పరిధిలోని చదలవాడ వెంకటయ్య ఇంటికి వెళ్లి వివరాలు అడుగుతున్న కారోబర్ మహేష్‌పై అకారణంగా వెంకటయ్య ఐరన్ సలాకా(రాడ్)తో దాడి చేసి గాయపరిచాడు. పంచాయతీ కార్యదర్శి కుంజ సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా.. మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతమైన కమలాపురం ఇంటెక్‌వెల్ ప్రాంతాన్ని ఎస్సై టీవీఆర్ సూరి బుధవారం పరిశీలించారు. వర్షాలు పడే అవకాశం ఉండటంతో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన వరద తీవ్రత ప్రాంతాలను సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. మంగపేట నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సూరిని కాంగ్రెస్ పార్టీ నాయకులు వల్లెపల్లి శివప్రసాద్, కర్రి నాగేంద్రబాబు, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ కోడ బాలకృష్ణ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, ట్రస్ట్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

మరమ్మతులు చేపట్టాలి

మల్హర్: ఆరెవాగు వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ, జెన్‌కో అధికారులను కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్ కోరారు. మండలంలోని మల్లార గ్రామ పంచాయతీ పరిధిలోని దబ్బగట్టు శివారులో ఉన్న ఆరెవాగు వంతెనను ఆర్అండ్‌బీ ఏఈ అవినాష్‌తో కలిసి బుధవారం రమేశ్ పరిశీలించి, మాట్లాడారు. ఆరెవాగు వంతెనపై బొగ్గు లారీలు, ఇసుక లారీలు, భారీ వెహికల్స్ నడవడం వలన గుంతలు ఏర్పడి, ఇనుప చువ్వలు తేలి బ్రిడ్జి కూలిపోయే స్థితిలో ఉందని తెలిపారు.



వంతెనను పరిశీలిస్తున్న రమేశ్

ఇంటి స్థలాలు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): గోదావరి వరద ముంపునకు గురవుతున్న ఆదివాసీలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించాలని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కోర్సా నర్సింహమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల ప్రత్యేకాధికారి స్వర్ణలత, తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, ఎంపీఓ హనుమంతరావులకు ఆదివాసీల సమస్యలపై నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం వర్షాకాలం సీజన్‌లో గోదావరి వరదకు యాకన్నగూడెం ముంపునకు గురవుతుందన్నారు. వరదలు తగ్గుముఖం పట్టే వరకు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నివాసం ఉండాల్సి వస్తుందని వాపోయారు. వరద నీరు ఇళ్లలోకి రావడం మూలంగా పాములు, తేల్లు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు వరద ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఇంటి స్థలాలు కేటాయించాలని పాల్గొన్నారు.

పత్తి విత్తనాలు విత్తుకోవాలి

మల్హర్: ఆశించిన మేర వర్షాపాతం నమోదు అయినందును రైతులు పత్తి విత్తనాలు విత్తుకోవాలని మహదేవపూర్ ఏడీఏ శ్రీనివాసరాజు సూచించారు. మండలంలోని అన్సాన్‌పల్లి, నాచారం గ్రామాల్లోని పత్తి చేన్లను బుధవారం ఏడీఏ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తిని అధిక సాంద్రత పద్ధతిలో విత్తుకోవడం వలన అధిక దిగుబడి పొందవచ్చని సూచించారు.

డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ ఆకస్మిక మృతి

వాజేడు: మండల పరిధిలోని పేరూరు డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ నరేష్ యాదవ్(35) బుధవారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఖమ్మం జిల్లాకు చెందిన నరేష్ యాదవ్ నాలుగు నెలల క్రితమే బదిలీపై పేరూరులోని బ్యాంకుకు అసిస్టెంట్ మేనేజర్‌గా వచ్చారు. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో గగ్గురి రమణయ్య ఇంట్లో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆరోగ్యం బాగా లేదని బుధవారం విధులకు రాలేనని బ్యాంకు ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి ఓనర్ రమణయ్యకు నరేష్ యాదవ్ అపస్మారక స్థితిలో కనిపించడంతో బ్యాంకు అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. బ్యాంకు సిబ్బంది వచ్చి చూసే సమయానికే నరేష్ యాదవ్ మృతి చెంది ఉన్నాడు. అదే సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ సీఈఓ బ్యాంకు తనిఖీ కోసం వచ్చారు. నరేష్ యాదవ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన మృతదేహాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం నరేష్ యాదవ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా, గ్యాస్ ఫామ్ అధికం కావడంతోనే మృతి చెంది ఉంటాడని పలువురు అభిప్రాయ పడుతున్నారు. తోటి ఉద్యోగి మృతి చెందడంతో సిబ్బంది కంట తడి పెట్టుకున్నారు. అసిస్టెంట్ మేనేజర్ మృతిపై పేరూరు పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. మృతదేహాన్ని బంధువులు ఖమ్మం జిల్లాలోని స్వగ్రామానికి తీసుకెళ్లినట్లు తెలిసింది.



నరేష్ యాదవ్ మృతదేహం

కోడిగుడ్లు పగులగొట్టిన దుండగులను శిక్షించాలి

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రం, 5వ అంగన్‌వాడీ కేంద్రంలో 700 కోడిగుడ్లను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఏటూరునాగారం ఐసీడీఎస్ సీడీపీఓ హేమలత అన్నారు. సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా ఆదేశాల మేరకు బుధవారం సాక్షిలో ప్రచురితమైన వార్త కథనానికి స్పందించి వివరణ ఇచ్చారు. బుట్టాయిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టి అందులోకి దూరి పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ఇవ్వాల్సిన కోడిగుడ్లను ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. వాటిని ఈనెల 16వ తేదీ రాత్రి ధ్వంసం చేసినట్లు తెలిసిందని, సోమవారం సెలవు కావడంతో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు వెళ్లి చూసే సరికి కోడిగుడ్లు ధ్వంసం అయి ఉన్నాయన్నారు. ఈ మేరకు చింతగూడెం సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీవిద్య సంఘటన వివరాలు తెలుసుకొని కన్నాయిగూడెంలో పీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీడీపీఓ తెలిపారు. దుండగులను శిక్షించాలని ఆమె కోరారు.

నాణ్యమైన విద్య అందించాలి

వెంకటాపురం(కె): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించి ఆదర్శవంతమైన పూర్వప్రాథమిక కేంద్రాలు(ఈసీసీఈ)గా మార్చుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా సూచించారు. ఐసీడీఎస్ వెంకటాపురం(కె) ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం సీడీపీఓ శిరీషా అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఈసీసీఈపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు జిల్లా సంక్షేమ అధికారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్ వాడీ కేంద్రాల్లో సమయపాలన ప్రకారం తరగతులు నిర్వహించాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరిని ప్రీస్కూల్‌లో చేర్పించాలన్నారు. ఈసీసీఈ సులభంగా అర్థమయ్యేరీతిలో ప్రియదర్శిని పుస్తకం ద్వారా బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చంద్రకళ, పుష్పవతి, రమాదేవి, ట్రైనర్లు కమురునీసా బేగం, జ్యోతి, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ విజేందర్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను అందిస్తున్న స్వర్ణలత లెనినా

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



సంబరాల్లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి సీతక్క



ఏటూరునాగారం: కేక్ కట్ చేస్తున్న నాయకులు

ములుగు రూరల్: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జిల్లాలోని ఇంచర్ల ఎంఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అధ్యక్షతన వేడుకలు నిర్వహించగా రాష్ట్ర మంత్రి సీతక్క కేక్ కట్ చేశారు. సీతక్క మాట్లాడుతూ అన్ని వర్గాల కోసం పోరాటం చేస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని అన్నారు.

మండల కేంద్రంలో..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, సొసైటీ అధ్యక్షుడు చిడెం మోహనరావు, చిడెం శివ, బాలసాని వేణు, రమేష్ ఉన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిటమట రఘు, నాయకులు కిషోర్, ఎల్లయ్య, ఖలీల్, బాలరాజు, నర్సింహులు, సర్దార్‌పాషా, నవీన్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే ఆందోళన

ములుగు రూరల్: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతు రుణమాఫీ చేసి కొత్త రుణాలను అందించాలన్నారు. జిల్లాలో ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతంగా ఉండడంతో రైతులకు హక్కు పత్రాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు లేకుండా పోయాయన్నారు. దీంతో రైతులు పూర్తిస్థాయి పట్టాలు లేక ప్రభుత్వం అందించే సహాయం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి జలాలను జిల్లా రైతులకు సాగునీటి నిమిత్తం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొర్ర రాజు, ఎండి గఫూర్, రత్నం ప్రవీణ్, సద్దాం హుస్సేన్, రవీందర్, రమేష్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

రోడ్డు పనుల పరిశీలన

మల్హర్: మండలంలోని రుద్రారం గ్రామంలో చేపడుతున్న డబుల్ రోడ్డు పనులను ఆర్అండ్‌బీ డీఈ రమేశ్ బుధవారం పరిశీలించారు. బస్వాపూర్ నుంచి రుద్రారం వరకు 6 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న డీఈ రమేష్

జేసీబీ బోల్తా.. డ్రైవర్ మృతి



కార్తీక్ మృతదేహం

కన్నాయిగూడెం: జేసీబీ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని దేవాదుల వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీకి చెందిన దేవాదుల గ్రామం వద్ద బుధవారం సాయంత్రం కాల్వపనులు చేస్తు మోరీని తొలగిస్తున్న క్రమంలో జేసీబీ అదుపు తప్పి బోల్తాపడింది. సంఘటనలో జేసీబీని ఆపరేట్ చేస్తున్న డ్రైవర్ కార్తీక్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం సింగపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియనున్నాయి.